సబ్జక్టులో ఫెయిల్ కావడంతో..

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ఉస్మానియా యూనివర్సిటీ: సెమిస్టర్‌లో ఒక సబ్జెక్ట్ ఉత్తీర్ణత కాకపోవడంతో ఓయూ టెక్నాలజీ కళాశాలలో కెమికల్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నన ఓ విద్యార్థి బుధవారం సాయంత్రం ఆత్మహత్యకు యత్నించాడు. తోటి విద్యార్థులు గమనించి హుటాహుటిన వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ కళాశాలలో కెమికల్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ప్రణయ్ శశాంక్ (22) మొదటి సెమిస్టర్‌లో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయ్యారు. దీంతో రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకుని పాసయితాననే విశ్వాసంతో సప్లమెంటరీ పరీక్షకు కూడా హాజరు కాలేదు. తీరా రీవాల్యుయేషన్‌లో కూడా ఉత్తీర్ణత సాధించలేకపోయాడు. ఇటీవల విడుదలైన గేట్ ఫలితాల్లో ఉత్తమ స్కోరు సాధించిన ప్రణయ్‌కు పీజీలో ఐఐటీల్లో ప్రవేశం పొందే అవకాశం లభించింది. అంతకు ముందుగానే అతడు ఆన్లైన్ లో ఓ కోర్స్ పూర్తి చేశాడు. దానిని పరిగణనలోకి తీసుకొని క్రెడిట్ ట్రాన్స్ఫర్ చేయడం ద్వారా తనను పాస్ చేయాలని కోరారు. దీనికి అధికారులు నిరాకరించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రణయ్ హాస్టల్ కి వెళ్లి బుధవారం సాయంత్రం ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్నేహితులు అతన్ని దుర్గాబాయ్ దేశముఖ్ వైద్యశాలకు.. అక్కడి నుంచి నిమ్స్ కు తరలించారు. దీంతో విద్యార్థులు గురువారం ఉదయం కళాశాలలో ఆందోళనకు దిగారు. అధికారుల వైఖరితోనే ప్రణయ్ ఆత్మహత్యకు యత్నించాడని ఆరోపించారు. ఓయూ వీసీకి వ్యతిరేకంగా నినదించారు. ఇతర యూనివర్సిటీల్లో క్రెడిట్ ట్రాన్స్ఫర్ చేస్తున్నప్పుడు తమ కళాశాలలో ఎందుకు చేయరని ప్రశ్నించారు. ప్రణయ్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమేశ్ కుమార్ వివరణ ఇస్తూ నిబంధనల ప్రకారమే తాము వ్యవహరించామని స్పష్టం చేశారు. నియమ నిబంధనలకు అనుగుణంగా క్రెడిట్ ట్రాన్స్ఫర్ సాధ్యపడదని చెప్పారు. ప్రణయ్ ఉదంతంపై అధికారులు సమావేశమై చివరి సంవత్సరం విద్యార్థులకు ఐదవ సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్షలను మరోసారి నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ప్రణయ్‌శశాంక్

జాబ్ ఇప్పిస్తానంటూ మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా మల్టీ నేషనల్ కంపెనీల్లో ఐటి ఉద్యోగాలు కల్పిస్తామంటూ నిరుద్యోగులనుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన కడపకు చెందిన బండి అజయ్‌కుమార్ అనే వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లోని డిడి కాలనీకి చెందిన ఫిబ్రవరి 17న టెలిగ్రామ్‌లో ఉద్యోగ ఆఫీసర్ సందేశం వచ్చిందని పేర్కొంటూ ఫిర్యాదు చేశారు. బండి సంజయ్ కుమార్ వాట్సప్ ద్వారా ఫిర్యాదుదారుడిని సంప్రదించాడు. అతను ఉద్యోగ సలహాదారుడని చెప్పుకుని, రూ.6లక్షల ప్యాకేజితో యాక్సెంచర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. అతనిని నమ్మి ఫిర్యాదు దారుడు రూ.2లక్షల మొత్తాన్ని బదిలీ చేశాడు. తర్వాత తనను మోసం చేసినట్లు గ్రహించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి అతని నుంచి ఒక మొబైల్ ఫోన్, ఒక ల్యాప్‌టాప్, నాలుగు బ్యాంక్ పాస్ బుక్స్, 3చెక్ బుక్స్, 2 డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రేడింగ్‌లో లాభాలంటూ 62 లక్షలు టోకరా

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): ఫేస్‌బుక్‌లో ట్రేడింగ్ ప్రకటనను క్లిక్ చేసిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి రూ. 62 లక్షలు పొగొట్టుకున్నాడు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. నేరెడ్‌మెట్‌కు చెందిన బాధితుడికి ఫిబ్రవరి నెలలో ఫేస్‌బుక్‌లో ట్రేడింగ్ యాడ్ కనిపించింది. దానిని క్లిక్ చేసి పేరు, ఫోన్ నంబర్ లాంటి వివరాలు ఇచ్చాడు, దీంతో బాధితుడి ఫోన్ నంబర్‌ను ఐసీఐసీఐ సెక్యూరిటీస్ గ్రూప్ డీ2 పేరుతో ఉన్నవాట్సాప్ గ్రూప్‌లో చేర్చారు. అక్కడ ట్రేడింగ్ గూర్చి మెళకువలు చెప్పినట్లు నటిస్తూ రోజు 30 శాతం వరకు లాభాలొస్తాయంటూ సైబర్‌నేరగాళ్లు నమ్మించారు. ఆ తరువాత ఐసీఐసీఐఎంపీఆర్ఓ.కామ్ పేరుతో ఉన్న వెబ్‌సైట్ లింక్‌ను పంపించారు, అది క్లిక్ చేయగానే బాధితుడి ఫోన్ నెంబర్‌తో డీమాంట్ అకౌంట్ ఓపెన్ అయినట్లు మేసేజ్ వెళ్లింది. మొదట రూ. 10 వేలు పెట్టుబడి పెట్టడంతో 2 వేలు లాభం కన్పించింది. ఇక అదంతా నిజమని నమ్మిన బాధితుడు ఆ తరువాత దఫ దఫాలుగా రూ. 11,61,300 పెట్టుబడి పెట్టాడు. స్క్రీన్‌పై లాభాలు కన్పిస్తుండడంతో లాభాలు వస్తున్నాయని అనుకున్నాడు. ఇంతలోనే ఐపీఓలు కొంటే మంచి లాభాలొస్తాయంటూ సైబర్‌నేరగాళ్లు నమ్మించారు, ఫలాన కంపెనీ ఐపీఓకు దరఖాస్తు చేసుకోవాలని 50 శాతం డిస్కౌంట్ వస్తుందంటూ నమ్మించి రూ. 30 లక్షల షేర్లు కొన్చారు.. అనంతరం మరో కంపెనీ ఐపీఓ షేర్లకు పెట్టుబడి పెట్టించారు. ఆ తరువాత పెట్టుబడికి డబ్బు లేకుంటే లోన్ ఇస్తారంటూ నమ్మించారు. అప్పటికే రూ. 62 లక్షల వరకు పలుమార్లు పెట్టుబడి పెట్టిన బాధితుడికి యాప్‌లో ఆయా షేర్ల విలువ కోటి రూపాయలకుపైగా కన్పిస్తోంది. ఇక వాటిని విత్‌డ్రా చేసుకోవాలని బాధితుడు ప్రయత్నించాడు, అయితే మీరు రూ. 37 లక్షలు లోన్ తీసుకున్నారు వాటిని చెల్లించిన తరువాత మీకు ఆ ఖాతాలో ఉన్న డబ్బు విత్‌డ్రా చేసుకునేందుకు అనుమతి ఉంటుందంటూ సైబర్‌నేరగాళ్లు సూచించారు. దీంతో ఇదంతా అనుమానాస్పదంగా ఉందని భావించిన బాధితుడు సికింద్రాబాద్ మారేడ్‌పల్లిలోని ఐసీఐసీఐ సెక్యూరిటీస్ అఫీస్‌కు వెళ్లి ఆరా తీయడంతో అదంతా ఫేక్ అని తేలింది. దీంతో తనను రూ. 62 లక్షలు చీటింగ్ చేశారంటూ బాధితుడు రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మార్ఫింగ్ ఫొటోలతో వివాహితను..

హైదరాబాద్‌కు చెందిన 21 ఏళ్ల యువతికి గతంలో మెహిదీ పట్నానికి చెందిన అకుల్ సింగ్ అనే వ్యక్తితో పెండ్లి సంబంధం కుదిరింది. అయితే కొన్ని కారణాల వల్ల చివరి నిమిషంలో వారి పెండ్లి ఆగిపోయింది. దీంతో ఆమె మరొకరిని వివాహం చేసుకున్నది. ఈ నేపథ్యంలో అకుల్‌సింగ్ ఇన్‌స్టాలో ఓ నకిలీ ఐడీ తయారు చేసుకొని దాని ద్వారా వివాహితకు చెందిన మార్ఫింగ్ ఫొటోలు, ఆమె చెల్లెలికి చెందిన మార్ఫింగ్ ఫొటోలు .. తయారు చేస్తాడు. వాటిని సదరు వివాహితకు పంపి బ్లాక్ మెయిల్ చేశాడు. ఈ క్రమంలో వివాహిత.. ఈ సమస్య పరిష్కారం కోసం అకుల్ సింగ్‌ను సంప్రదించి.. సదరు ఐడీ ద్వారా తనకు జరిగిన అన్యాయంపై వివరిస్తుంది. దీన్ని పరిష్కరిస్తానని వివాహితకు హామీ ఇచ్చిన అకుల్ సింగ్... తాను సృష్టించిన ఫైక్ ఐడీకే 6 లక్షల రూపాయలు పంపినట్టుగా చాట్ చేస్తాడు. ఆ స్క్రీన్ షాట్‌లను ఓ సాక్ష్యంగా వివాహితకు పంపి.. సమస్య పరిష్కారమైనట్టుగా నమ్మించే ప్రయత్నం చేశాడు. తనకు 6 లక్షల రూపాయలు తిరిగి ఇవ్వాల్సిందిగా ఆమెకు చెబుతాడు. అయినప్పటికీ ఫేక్ ఐడీ నుంచి మార్ఫింగ్ ఫొటోలు ఆగకపోవడంతో అనుమానం పెరిగిన వివాహిత తన భర్త ద్వారా సైబర్ పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు విచారణ జరిపి అకుల్‌సింగ్‌ను అరెస్టు చేశారు.

డిజిటల్ అరెస్టు చేసిన వ్యక్తి అరెస్టు

నగరానికి చెందిన 72ఏళ్ల వ్యక్తికి ముంబై ఎయిర్‌పోర్ట్ నుంచి మాట్లాడుతున్నామంటూ..ఓ కాల్ వచ్చింది. సదరు వ్యక్తి పేరు మీద ముంబై నుంచి ఇరాన్‌కు ఫెడెక్స్ ఇంటర్నేషనల్ సర్వీస్‌కు ఒక పార్సిల్ వచ్చిందని చెప్పారు. ఈ పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని దీని తక్షణ విచారణ నిమిత్తం ముంబై క్రైమ్ పోలీసులు, నార్కొటిక్ విభాగం వారితో ఫోన్ కాల్ కనెక్ట్ చేస్తున్నామని తెలిపారు. సదరు వ్యక్తికి అనేక రాష్ట్రాల్లో బ్యాంకు అకౌంట్లు ఉన్నాయని చెబుతూ హైదరాబాద్‌లో ఉన్న బ్యాంక్ అకౌంట్ వివరాలు చెప్పడంతో.. బాధితుడు మాట్లాడుతున్న వాళ్లు పోలీసులేనని నమ్మక తప్పలేదు. ఇలా భయపెట్టి సైబర్ నేరగాళ్లు 19.6 లక్షలు తమ అకౌంట్లలోకి జమ చేయించుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన సైబర్ క్రైమ్ పోలీసులు యూపీ లోని గజియాబాద్‌కు చెందిన రంజిత్‌కుమార్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు.

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డిఎస్పీ జావేద్, తదితరులు

52 కిలోల గంజాయి పట్టివేత

మారేడ్ పల్లి, ఏప్రిల్ 10 : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ 7 వ నెంబర్ ప్లాట్ ఫారం లో 26 లక్షల విలువచేసే 52 కేజీల ఎండు గంజాయి బ్యాగులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే డిఎస్పి ఎస్ ఎన్ జావెద్, ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప లతో కలిసి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రైల్వే స్టేషన్ లోని ఏడవ నెంబర్ ప్లాట్ఫారంలో కాజీపేట వైపు ఈ నెల 9వ తేదీన ఆర్పిఎఫ్, జి ఆర్ పి పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తుండగా.. నాలుగు భారీ బ్యాగులు అనుమానాస్పదంగా అక్కడ ఉన్నాయి. ఆ బ్యాగుల వద్ద ఎవరు లేకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చింది . వెంటనే ఆ బ్యాగులను ఓపెన్ చేసి చూడగా అందులో గంజాయి ఉందని పోలీసులు గుర్తించారు. వెంటనే రైల్వే సిబ్బంది వాటిని స్వాధీనం చేసుకున్నారు. స్థానికంగా ఉన్న పలువురిని, స్టాల్స్ వ్యాపారులను ఈ బ్యాగ్ ల గురించి ఆరా తీయగా ఏ లాంటి సమాచారం లభించలేదు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మీదుగా రైల్లో అక్రమంగా నిందితులు వివిధ రాష్ట్రలకు తరలిస్తున్నట్టు రైల్వే పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని రైల్వే డిఎస్పీ జావేద్ వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతిలేదని తేల్చేవారేరీ?

విద్యా నిబంధనలకు విరుద్ధంగా నగరంలో పాఠశాలలు

తల్లిదండ్రులను మోసం చేస్తు అడ్మిషన్లు

ఏడాది చివర్లో కండ్లు తెరుచుకుంటున్న అధికారులు

రాబోయే విద్యా సంవత్సరానికి అనుమతి ఉన్న పాఠశాలల లిస్టు ప్రకటించేనా?

చివరి దశలో గుర్తింపు లేదని పాఠశాలలపై చర్యలు

నష్టపోతున్న విద్యార్థులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : నగరంలో గుర్తింపులేని పాఠశాలలు విద్యార్థుల పాలిట శాపంగా మారుతున్నాయి. పాఠశాలకు గుర్తింపే ఉండదు.. ఫీజులు మాత్రం లక్షల్లో వసూలు చేస్తారు. అడ్మిషన్ ఫీజు, బుక్స్, యూనిఫాం, ప్రాజెక్టు తదితర పేర్లతో తల్లిదండ్రుల నుంచి అందనకాడికి లాగేస్తారు. ఏ మాత్రం విద్యాశాఖ నిబంధనలు పాటించకుండా దర్జాగా అడ్మిషన్ల ప్రక్రియ జరుపుతారు. చదువులు చెబుతూ మధ్యమధ్యలో ఫీజుల వసూళ్లు చేపట్టి డబ్బులు సంపాదిస్తారు. చదువులు చివరికి వచ్చేసారికి ఆ ప్రాంతానికి చెందిన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ అధికారితో బేరసారాలు జరిపి తమ స్కూల్‌కు అనుమతి లేదని మీరే చూసుకోవాలని చేతులెత్తేస్తున్నారు. దీంతో అప్పటి వరకు చదువుకున్న విద్యార్థులంతా చెల్లాచెదురవుతున్నారు. అయితే ఇవి చాలా వరకు బయటకు రాకుండానే కొంతమంది విద్యాశాఖ అధికారులు అనుమతి లేని పాఠశాలలతో లాలూచిపడి మేనేజ్ చేస్తున్నారు. వేరే స్కూల్ పేరుతో విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. ఇలా నగరంలో మొత్తం సుమారు 2374 పాఠశాలలు ఉండగా ఇందులో సుమారు 477 పాఠశాలలు గుర్తింపు లేకుండా నడుస్తున్నాయి. ఈ రాబోయే విద్యా సంవత్సరానికి అయిన విద్యాశాఖ అధికారులు మేల్కొని గుర్తింపు లేని పాఠశాలలను రద్దు చేసి.. గుర్తింపు ఉన్న పాఠశాలల లిస్టును ప్రకటించేల చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

అనుమతే ఉండదు.. తగ్గేదేలే అంటారు..!

నగరంలో చాలా స్కూల్స్ తమకు అనుమతి లేకున్నా ఫీజుల వసూల్ విషయంలో తగ్గేదే లే అంటూ వ్యవహరిస్తున్నారు. ఇటీవల 800 మంది విద్యార్థులు చదువుతున్న గోల్కొండలోని అర్చిడ్స్ పాఠశాలకు అనుమతి లేదని అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ తరహాలో అనేక పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. విద్యాశాఖా అధికారులు దృష్టి సారిస్తే వాటి బాగోతం బయటపడుతుందని విద్యార్థి సంఘాల నాయకులు చెబుతున్నారు. ఎల్‌కేజీ చదువుకు ఏడాదికి లక్ష రూపాయలు.. పుస్తకాలకు 15వేలు.. దుస్తులు రూ.5000 వేలు ఇలా ఒక్క విద్యార్థికి చదువు చెప్పడానికి తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి ప్రయివేట్ పాఠశాలలు. ఇంత ఫీజు ఏంటని అడిగితే 'మీ ఇష్టం అడ్మిషన్ రద్దు చేసుకోండి.' అంటూ ఎదురుదాడితో పేరెంట్స్‌ను బెదిరిస్తున్నారు. ఇదెక్కడి అన్యాయం అంటూ విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేస్తే సమాధానం ఉండదని బాధితులు చెబుతున్నారు. దీంతో అందినకాడికి దోచెయ్ అన్నట్టుగా పాఠశాలల యాజమాన్యాలు డబ్బులు దండుకోవడానికి పోటీపడుతున్నాయి. కొన్ని పాఠశాలలు ఇప్పటికే రాబోయే అకాడమిక్ అడ్మిషన్ల ప్రక్రియ కూడా ముగించాయని.. వాటిపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నిబంధనలు బేఖాతరు..!

పాఠశాల స్థాపించాలంటే విద్యాశాఖ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అందులో ముఖ్యంగా మద్యం దుఖాణాలు, ప్రార్థన మందిరాలకు పాఠశాల దూరంగా ఉండాలి. 24 శాఖల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్ఓసీ) తీసుకోవాలి. భవన రిజిస్ట్రేషన్, అగ్ని మాపకం తప్పనిసరి. అయితే నగరంలో చాలా పాఠశాలలను కేవలం లాభార్జన మీదనే నెలకొల్పుతున్నారు. డీఈడీ, బీఈడీ, లాంగ్వేజ్ పండిట్ కోర్సులను పూర్తి చేయని వారిని ఉపాధ్యాయులుగా నియమించుకుని పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారని ఫిర్యాదులు అందినా డీఈఓ చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ విషయం విద్యాశాఖాధికాలకు దృష్టిలో ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. విద్యాశాఖ ప్రమాణాలు పాటించకుండా, వివిధ శాఖల నుంచి అనుమతి తీసుకోకుండా పాఠశాలలను నిర్వహిస్తున్నా తమకు పట్టన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

నడిరోడ్డుపై కత్తులతో పొడిచి.. మహిళ దారుణ హత్య

ఇంకా పరారీలోనే..నిందితులు

మృతురాలు లక్ష్మి (ఫైల్)

మన్సూరాబాద్, ఏప్రిల్ 10: నగరం నడిరోడ్డుపై కొందరు దుండగులు ఓ మహిళను కత్తితో పొడిచారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆ మహిళ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. బడంగ్ పేట లోని సబితా ఇంద్రారెడ్డి నగర్ కాలనీకి చెందిన లక్ష్మి (40) సోమవారం సాయంత్రం పని నిమిత్తం ఎల్బీ నగర్‌కు వచ్చింది. ఈనెల 8న సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇంటికి వెళ్లేందుకు ఆమె ఎల్బీనగర్, దానాపూర్ రోడ్డు లోని రిషి కిచెన్ సమీపంలో నిల్చున్నది. రోడ్డుపై నిల్చున్న ఆమె వద్దకు వచ్చిన కొందరు వ్యక్తులు లక్ష్మితో గొడవకు దిగారు. ఇరువురి మధ్య వాగ్వాదం పెరిగి విచక్షణ కోల్పోయిన సదరు వ్యక్తులు నడిరోడ్డుపై కత్తితో లక్ష్మి కడుపు, ఎద, ముఖంపై విచక్షణారహితంగా పొడిచి అక్కడి నుంచి పారి పోయారు. ఈ ఘటనలో లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమె రక్తపు మడుగులో పడి ఉండగా అటువైపుగా వచ్చిన ఓ రిక్షా డ్రైవర్ గమనించాడు. ఆమెను గుర్తుపట్టి సమీప బంధువుకు విషయాన్ని తెలిపాడు. వరలక్ష్మిని దిల్‌సుఖ్‌నగర్‌లోని కృతిక దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు. తీవ్ర గాయాలతో 3 రోజులపాటు ఆసుపత్రిలో చికిత్స పొందిన లక్ష్మి బుధవారం అర్ధరాత్రి దాటినా అనంతరం మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతురాలి అల్లుడు బాబు నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు..మహిళపై కత్తితో దాడికి పాల్పడిన నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

గురువారం మధ్యాహ్నం ఖైరతాబాద్ నుంచి ట్యాంక్‌బండ్ వెళ్లేదారిలో వాహనాలతో కిక్కిరిసి పోయి ట్రాఫిక్ జాం ఏర్పడిన దృశ్యం

తెగుతున్న బంధాలు.. పోతున్న ప్రాణాలు

(మొదటిపేజీ తరువాయి)

నడిరోడ్డుపై ఉమేశ్ అనే వ్యక్తిని సొంత తమ్ముడు మరో వ్యక్తి సాయంతో కత్తితో పొడిచి చంపాడు. దీనికి కూడా ఉమేశ్ మద్యానికి బానిసై తల్లిని కొడుతూ వేధింపులకు గురి చేస్తున్నాడని చంపినట్లు నిందితుడు రాకేశ్ చెప్పాడు.

* హైదరాబాద్‌లోని మలక్‌పేటలో ఇటీవలనే శిరీష అనే మహిళను సొంత ఆడబిడ్డ సరిత మత్తు ఇంజెక్షన్ ఇచ్చి దిండుతో గొంతును అదిమిపట్టుకుని చంపింది. సరితకు శిరీష భర్త వినయ్, అతడి అక్క కొడుకు నిహాల్ సహకరించడం గమనార్హం. వినయ్, శిరీష ప్రేమ వివాహం చేసుకున్నారు. నర్సుగా పనిచేస్తున్న సరితను తరచూ దవాఖానలు ఎందుకు మారుతున్నావని మందలించినందుకు కోపంతో చంపేసింది.

* హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వీరనారాయణపూర్‌లో తల్లిని గొడ్డలితో నరికి చంపాడు ఓ కుమారుడు. చదిరం అజయ్‌కు తన తల్లి రేణుకతో కొద్దిరోజులుగా తరచూ గొడవ జరుగుతున్నది. ఈక్రమంలో మార్చి 5న మరోసారి గొడవ జరగడంతో ఆవేశంలో గొడ్డలితో నరికి చంపాడు.

* సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో వివాహేతర ప్రియుడిని పెళ్లి చేసుకోవాలనే కామవాంఛతో రజిత అనే మహిళ ఏకంగా తన ముగ్గురు కుమారులను గొంతు నులిమి చంపేసింది. ఆరు నెలల క్రితం రజిత తన పదో తరగతి క్లాస్ మేట్స్ గెట్ టూ గెదర్ కార్యక్రమంలో కలిసిన తన స్నేహితుడు శివతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. తన భర్త రజిత కంటే 20 ఏండ్లు పెద్దవాడు కావడం వల్లనే శివను పెళ్లి చేసుకోవడానికి ఈ దారుణానికి ఒడిగట్టింది.

ప్రాణం తీసిన తండ్రి పింఛన్

అక్కను హతమార్చిన తమ్ముడు

అన్నపై కత్తిపోట్లు.. తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడ్డ అన్న సుదర్శన్, తమ్ముడు చేతిలో హతమైన లక్ష్మి

మలక్ పేట ఏప్రిల్ 10: తండ్రి పింఛన్ డబ్బుల కోసం కుటుంబ సభ్యులతో గొడవ పడ్డ తమ్ముడు, అక్కను హతమార్చి అన్నను తీవ్రంగా గాయపరిచిన ఘటన చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత మలక్ పేట డివిజన్ వెంకటరమణ అపార్ట్ మెంట్‌లో గురువారం జరిగింది. ఎస్ఐ భరత్ కుమార్ కథనం ప్రకారం.. వెంకటరమణ అపార్ట్ మెంట్ లోని ఫ్లాట్ నంబర్ 101లో రఘుపతిరావు అనసూయ బాయి దంపతులు నివాసముంటున్నారు. వీరికి ఐదుగురు కుమారులు, నలుగురు కూతుళ్లు. రైల్వే ఉద్యోగియైన రఘుపతిరావు రిటైర్డ్ అయి 2010లో చనిపోయాడు. ఆయన పింఛన్ డబ్బులు భార్య అనసూయ బాయికి వస్తున్నాయి. తండ్రి పెన్షన్ డబ్బుల కోసం కుమారుడు మదన్ రావు కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడు. బుధవారం రాత్రి మదన్ రావు సహనాన్ని కోల్పోయి అక్క లక్ష్మి (68), అన్న సుదర్శన్(70) పై కత్తితో దాడి చేశాడు. లక్ష్మిని పొట్టలో నాలుగు సార్లు, ఛాతిపై మూడుసార్లు పొడవటంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, సుదర్శన్ తీవ్రంగా గాయపడ్డాడు. భయపడ్డ మరో సోదరి (చెల్లి) పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలికి చేరుకున్న చాదర్ ఘాట్ పోలీసులు మదన్ రావును అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చాదర్ ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్ల నిర్వహణలో బెడిసికొట్టిన వ్యూహం!

(మొదటిపేజీ తరువాయి)

పంపించినట్లు తెలిసింది.

మెట్రో నగరాలకు ఆదర్శంగా..

ఎల్లవేళలా సాఫీగా ప్రయాణానికి అనువుగా ఉండాలి.. ఇది కాంప్రెహెన్సివ్ రోడ్ మెయింటనెన్స్ ప్రోగ్రామ్ (సీఆర్ఎంపీ) లక్ష్యం..ప్రధాన రహదారుల నిర్వహణలో భాగంగా 510 విభాగాలుగా విభజించి తొలి విడుతగా 744.220 కిలోమీటర్ల రహదారిని 2020 సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. నిర్ణీత గడువులో మొదటి విడుతను పూర్తి చేసి గుంతలు లేని నగరంగా తీర్చిదిద్దింది. ఈ సీఆర్ఎంపీ విధానం ఇతర మెట్రో నగరాలకు ఆదర్శంగా నిలిచింది. ఈ పథకాన్ని కొత్త ప్రభుత్వం చేపట్టక పోవడంపై విమర్శలు వచ్చాయి. కొన్ని నెలలుగా ప్రైవేట్ ఏజెన్సీలను పక్కన పెట్టి స్వంతంగా జీహెచ్ఎంసీ నిర్వహణ చేపడుతున్నది. ఈ నేపథ్యంలోనే మొదటి విడుత పథకం నిర్వహణను మళ్లీ ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడంతో పాటు కొత్తగా రెండో విడుతలో రూ. 424 చోట్ల కుగానూ 398.32 కిలోమీటర్ల మేరలో రూ.1334 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రెండు విడుతలు కలిపి 934 ప్రాంతాల్లో 1142.54 కిలోమీటర్ల మేరలో రూ.3825 కిలోమీటర్లలో సీఆర్ఎంపీ రోడ్ల నిర్వహణ ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు.

అనుమతులున్నా..వసూళ్లు చేస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

సొంతింటి నిర్మాణంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కృష్ణారావు కోరారు.

భవనాలను సీజ్‌చేయడం తగదు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 10: కూకట్‌పల్లి నియోజకవర్గంలో జీహెచ్ఎంసీ అధికారులు అసమగ్ర విధానాలతో భవన నిర్మాణదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని.. అక్రమ నిర్మాణాలను సీజ్‌చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్, అడిషనల్ సీసీపీ కూకట్‌పల్లి జోనల్ అధికారుల దృష్టికి భవన నిర్మాణదారుల సమస్యలను తీసుకెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. నియోజకవర్గం లో 50 కి పైగా భవనాలను సీజ్ చేయడం బాధాకరమని, ఎక్కడ లేని విధంగా కూకట్‌పల్లిలోనే అక్రమ నిర్మాణాలను సీజ్‌చేయడం సరికాదన్నారు. అధికారులు డబ్బులు తీసుకొని కూడా భవనాలను సీజ్‌చేస్తున్నారని వసూళ్ల కోసం టీంలను ఏర్పాటు చేసుకొని నిర్మాణదారులను ఇబ్బందులు గురి చేస్తున్నారని తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి అధికారుల తీరుతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి అన్నారు. బెదిరింపులకు పాల్పడుతున్న లీడర్లు నకిలీ మీడియా ప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PEST CONTROL

★చెదలు, బొద్దింకలు నివారణ: న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారంటీ మరియు శాన